# గత్తర

"ఊరును తమరే కాపాడాలి పంతులుగారు" అంటూ రెండు చేతులు జోడిస్తూ అన్న ముదుసలి పాపన్నను అనుసరించారు ఘడి ముందు గుమిగూడిన జనం. అప్పుడే లోపలినుండి వస్తున్న కరణంగారితో-

'అవును దొరా! నిన్న ముగ్గురు, రాత్రి ఐదుగురు. పదిమంది దాకా సుడిబడిన్నారింకా"- యింకొకరు.

"అసలు సంగతేమిట్రా"- తనకేమీ తెలియనట్లు అడిగాడు గ్రామ కరణం రంగారావు.

ఎత్తైయిన విగ్రహం. మత్తెక్కిన కళ్ళు నల్పును కోల్పో తున్న తల వెంట్రుకలు నలభై దాటినవవి సాక్ష్యం.

"తమరికి తెలియంచేముంది పంతులుగారూ! ఊర్కి గత్త రొచ్చింది. ఈ గండాన్ని తమరే తప్పియ్యాలి"

"గత్తర! అదెట్లొచ్చె మనూర్కి—" చూపుల్లో తెచ్చిపెట్టు కున్న ఆశ్రుత. మాటల్లో రకమైన అమాయకపు శబ్దం!

"ఎట్లొచ్చిందేముంది దొర! మొన్న లచ్చిగాడు పట్నంనుంచొ చ్చాడు. వచ్చీరావడంతోనే కక్కుడు మొదలైంది. తెల్లారేవరకు వాడు, మల్ల పొద్దుగూకే వరకు ఆవి పెండ్లాం - యిద్దర్నీ గద్ద తన్నుక పోయినట్టే..."

"మరి నా దగ్గరికొచ్చారేమిరా? సర్పంచ్ దగ్గరికి కెళ్ళండి". కరణంగారి ముఖంలో ఏవో ఎత్తిపొడుపు ముద్రలు కనిపించాయి.

"సర్పంచ్ డాక్టరిని తీసుకొస్తందుకు సమితికి పోయిండట ఊర్లోలేడు"

కరణంగారి పెదవుల మధ్య చిరునవ్వు నల్గింది. ఆతని గుండెలో గూడు కట్టుకున్న విషం కళ్ళలోకి ప్రాకింది దాన్ని దాయడానికి కాబోలు కళ్ళనొక్కసారి మూసి తెరిచాడు. వీళ్ళందరు గ్రామ పంచాయతీ ఎన్నికలలో తన మాట వినందికూడా గుర్తొ చ్చింది.

"మనుష్యులు చచ్చాక డాక్టర్లెందుకురా? అయినా, డాక్టర్లు గత్తరను కట్టినట్లు ఏ వూర్లనైనా విన్నారా?"

"లేద్దొరా - లేదు" సగానికి పైగా.

"ఎక్కడయిన లేదు" కొన్ని ముసలి గొంతులు కలసికట్టుగా సాక్ష్య మిచ్చాయి.

"అయినా మన తాత తండ్రులు ఏ డాక్టరిచేత చేయిఛారు!

యివన్నీ నదమంత్రపు చేతలు"- అన్నాడు కరణంగారి నమ్మిన బంటు.

"గత్తరకు డాక్టరేమి చేస్తాడు! కడితే, మంత్రగాళ్ళు కట్టాలి గాని"- పెద్దవాళ్ళ సలహా.

అంతవరకు ధోతి అంచును పరీక్షిస్తూ వింటున్న కరణంగారు- "అగ్గది! మంత్రగాళ్ళు కట్టవలసిందే!"

గ్రామ తగాదాలలో తనను ఎదిరించి, తన పనులు చస్తున్నా పట్టించుకోని మంత్రాల మారయ్య మనసులో మెదిలాడు.

"మరి, మన మారయ్య నడగలేక పోయారా!"

"ఆడా! ఆనికేమి తెలియదన్నాడు పంతులుగారు"

"తెలియదు! ఎందుకు తెలియదట? ఆ సంగతేదో నేను చూస్త గద!"

మస్కూరి వైపు చూస్తూ- "అరే! నీవె పోయి వాన్ని పత్రా-పంతులు తొందరగా రమ్మంటున్నారని చెప్పు"

గుంపులో గుస గుసలు

"అవును, వానిపనే-"

"పుల్ల బెట్టిండు. మెల్లగ గూసుండు"

"లేకుంటే యిట్లెన్నడన్నా జర్గిందా?"

నుదుట విభూతి, చేతిలో వెండి అంచులు వేసిన గండ్రగొడ్డలి, భుజాన నల్లగొంగళి, ముంజేతులకు వెండి కడియాలు, చెవులకు బంగారు పోగులు, బుట్టమీసాలు, తట్టంత తలపాగాతో గుంపును దాటి కరణంగారి ఎదుటికొచ్చి-

"దండాలు పంతులుగారు" గొడ్డలితోనే చేతులు జోడించి దండం

పెట్టాడు.

"దండం దండం" అంటూ నిలువెల్ల చూశాడు మారయ్యను.

"మారయ్యగారు..."

"అయ్యా! అయ్యా! దొరలు దొరలు ఎందుకు అంత విష్టూరం"

"విష్టూరం ఏముందిందులో! నిజం అడగడానికే పిలిపించాం"

"అడగండయ్యా......"

"నీ అంతటి మంత్రగాళ్ళుండగా వూరంతా పీనుగుల పెంటై పోతుందేనని..."

"దానికి నేనేం చెయను దొర!..."

"నీవు చెయ్యకపోతే మరెవ్వరు చేస్తారేమి! కావలసిన కార్యాలు చేసి ముందు గత్తరను కట్టు"

"నాకేమి తెలియదు దొరా! ఏదో పసుల కంటే..."

"పసుల కంటే – మనుషుల కంటవు! మనుషుల కంటే - పసుల కంటవు! అసలు నీ సంగతేమిటాంట!"

"అట్లంటే ఎట్లా...ఏదో......"

"అవు నవును! పెట్టడమెచ్చు తీయడంరాదు"

బెల్లం గొట్టిన రాయియయ్యాడు మారయ్య.

పిల్లలకు, పసులకు ఏదొచ్చినా మారయ్య బాగుచేస్తాడని ఊళ్ళోవాళ్ళ నమ్మకం. అంతేకాదు, పాము కాటుకు, తేలు కాటుకు పెట్టిన పేరట మారయ్య.

"అదంతా ఏం కురదదోయ్. నీవు గత్తరను కట్టాల్సిందే. లేపోతే ఊరంత పాడై పోద్ది"

మారయ్య మౌనంగా విలుచున్నాడు.

కరణం మనస్సులో గతం కదిలింది. తన పశువులు చస్తుంటే చూశాడు మారయ్య. తన పరువంతా పోతుంటే చూశాడు సర్పంచ్ యిదే అదును యీ దెబ్బతో వీనికి శాస్తి వానికి చెడు పేరు-అవిశ్వాసం.

"మారయ్యా! నీ యిష్టం. నేను చెప్పా! జనం నీ మీద కోపంగా వున్నారు"- జనం వైపు చూసి, "యిక మీరంతా వెళ్ళండి. అన్నీ నే చూస్తాగానీ"

"మంచిది"

"తమరిదయ"

"తమరే దిక్కు..."

"ఒరే మారయ్యా- నీవీ గత్తరను కట్టీకపోతే నిన్ను నరికి-గొనుక్కడతాంరా..." అంటూ అందరు కదిలి పోయారు-మస్కూరి తప్ప.

"యింటున్నావా? నీ యిష్టం. వాళ్ళను శాంతపరచాలంటే నీవీ గత్తరను కట్టాలి. కావలసినంత ఖర్చు తీసుకొని అమ్మవారి పండుగ చేయించు, బట్టలు యిప్పించు. లేదా నీవే బలైపోతావు. నీ యిష్టం. చూస్తు నిల్చుంటే పనికాదు. చేస్తువుంటే అవుద్ది"

"అరే మస్కూరి! వూళ్లోని కులపెద్ద లందర్కి చెప్పు-రాత్రికి అమ్మోరి పండుగని"

మారయ్య మాట్లాడలేదు.

"పండగైతే కానీ..." అంటూ కరణంగారు ఘడిలోకిపోయాడు

అమ్మవారి పండుగ జోరుగా జరుగుతోంది. నడివూళ్ళో వున్న అమ్మవారి గుడిముందు పందిళ్ళు వేసి తోరణాలు కట్టారు. డప్పుల

చప్పుళ్లు మారు మ్రోగుతున్నాయి. కులాల వారిగా కూర్చున్నా రందరూ. త్రాగడం తెలిసిన ప్రతివాడు బాగా త్రాగుతున్నాడు.

పందిరి క్రింద పసుపు, పిండి, బొగ్గు పొడితో వేసిన పటాల మీద (ముగ్గుల్లాంటివి) అన్నం పండి కుంభం పోశారు. ప్రక్కనే కల్లుకుండలు పొంగుతున్నాయి.

మంత్రాల మారయ్య మూగల నిక్కరు తొడుక్కొని, చేతిలో నిమ్మకాయలను గ్రుచ్చి వుంచిన నిలువుకత్తి పట్టుకొని అమ్మోరి దండకం చదువుతున్నాడు. ఉన్నట్టుండి డప్పుల చప్పుడు ఎక్కు వైంది. మైశాచ్చిపొగ గప్పున లేచింది. పోతును నరికారు. మేకలను, గొర్రెలను, కోడిపుంజులను ఒక్కొక్క వ్రేటున నరుకుతున్నారు. మరికొందరు తలలను ఇః పోసుకొని, వేపకొమ్మ లను పట్టుకొని "హుస్... హుస్..." అంటూ సిగం వూగు తున్నారు.

రాత్రంతా పండగ పేరు మీద జరగవలసినవన్నీ జరిగాయి తాగడం, తినడం, తందనాలాడడం.

తెల్లవారింది.

పొగచుట్టను పీలుస్తూ గడి ఎదుటకొస్తున్న కరణంగారి కెదు రుగా కొందరు పెద్దలెల్లగా-

"సర్పంచ్ గారింకా రాలేదా?"

"లేదండీ..."

"ఎందుకొస్తాడు? వూరు ఏమైపోతే ఆయనకెం?"

"ప్రజల బాగోగుల చూడడానికి గదండీ ఆయన్ని ఎన్ను కుంది...? అన్నాడొక యువకుడు.

"సమితాఫీసు సల్లగుంటే చాలు. వాళ్ళకి ఊరు, ఊర్లోవివాళ్ళ సంగతెందుకు?..."

"అయ్నా డాక్టరిని తీసుకురావటానికి వెళ్ళి యింకా రాలేదేమి?"

"ఆయన వస్తడు- 'డాక్టరును తీసుకొస్తడు, మారయ్యను పిలు..."

"ఆడు మంత్రాలు చదువుతునే వున్నడు. ఒక్కొక్కరు చస్తూనే వున్నారు"

"యిక వాడిచేత కాదు. వేరే మంత్రగాన్ని పొరుగూరి నుండైన పిలిపించాలి"

"తొందర పడకండి" అక్కడికే వస్తున్న మారయ్యా నుద్దేశిస్తూ-

"ఏం మారయ్యా ఎక్కువైందట?"

"నేనేమి చెయ్యను దొర! చెయ్యవలసిన పనులన్నీ చేశాను". వేరేవాడెవ్వడో ఎగనూకినట్లుంది.

"ఆ యింకెవ్వడున్నాడు ఎగనూకడానికి!"

"ఏ- యిదంత యీడిపనే"- మందిలోనుండి ఒకడు.

"నా కొడుకు చచ్చాడు"- ఓ తండ్రి

"నా అయ్య చచ్చాడు"- ఓ కొడుకు

"నా భర్త-" ఓ భార్య

"వింటున్నావా మారయ్యా- యిందరు చస్తుంటే చూస్తూ కూర్చున్నావేం?"

ఐదొందలు పెట్టి పండగ చేయించావు. అయినా గత్తర నాపలేక పోయావు. నీ యిష్టం, వీళ్ళంతా కోపంలో వున్నారు. ఏం జవాబు

చెప్పుతావో చెప్పుకో.

మారయ్య నోటినుండి మాట రావడంలేదు.

"వాదేమి చెప్పుతాదండీ! బొక్కలిరగ తంతేగాని చెప్పదు"

"వూర్కె పండ్లూడగొడితే వొద్దనలు"

"చెప్పరసె చెప్పు. గత్తర కదతానంటావా, లేదా?"

-అంటు ఓ వ్యక్తి అతన్ని రెక్కపట్టుకొని ఊపాడు.

"తన్ను తన్నుర, సంగీతానికి సింతకాయలు రాల్తాయా? దెబ్బ పెడితేగాని-" అంటూ మరొకడు లేశాడు.

సమయాన్ని గమనించిన కర్ణంగారి కనుబొమ్మలు సైగచేశాయి చెంప చెల్లుమంది.

వీపున గుద్దాదొకడు

దొక్కలో తిన్నాడింకొకడు

"అమ్మో" అంటూ నేల కొరిగాడు మారయ్య

తలరక్తం చిమ్మింది

గుండె ప్రాణం వదిలింది

ఇంతకు ముందే నరికిపడి వున్న బలి జీవులలో మారయ్య ఒకడైనాడు.

కరణం పగ తీరింది కాలి చల్లారిన పొగచుట్టను నేలకొట్టి అందర్నీ పిలిచి-

"ఎంతపని చేశార్రా, పోలీసుల కెరుకైతే యిప్పుదేం కావాలి?"

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కళ్ళలో/ భయం కడుపులో గుబులు. త్రాగిన కైపు దిగింది. చమటపట్టి కాళ్ళు చేతులు వణక సాగాయి.

కరణం మరొక చుట్టను వెలిగించి-

భయపడకండి, నేను చెప్పినట్లు చేయండి. వెంటనే వీన్ని పూడ్చేసి. వీడుకూడా గత్తరలోనే చచ్చాడని చెప్పండి విషయం బయటకు పొక్కిందో మీరందరూ బొనెక్కాల్సిందే. అంతేకాదు జైలుపాలవుతారు.

అందరూ సరేనన్నారు. కట్టు కట్టేశారు. కట్టు తప్పితే కాలం కూడుద్దన్నారు.

మాలయ్యను పూడ్చడం ముగిసింది. గంట గడిచింది.

గుడి దగ్గర నుండి ఘడివైపు నడుస్తున్న కరణం హఠాత్తుగా ఆగిపోయాడు. కడుపులో తిప్పుతోందని కళ్ళు మూసాడు.

ఆర్.యం.పి ని పిలవమన్నాడు. వళ్లు తిరుగుతోంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. పట్టణంలో చదువుకుంటున్న తన కొడుకు జ్ఞప్తికి వచ్చాడు. పెళ్ళికాని పెద్దకూతురు గుర్తుకొచ్చింది. పట్టాలు కాకుండా వుండిపోయిన భూములు కళ్ళముందు కదిలాయి. అంతలో జనం వూళ్లోవస్తున్న అంబులెన్స్ వైపు పరుగెత్తారు.